

కామారెడ్డిలో పాతబస్టాండు ప్రాంతంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎంగిలిపూల బతుకమ్మ సంబరం

చిత్తూ చిత్తూల బొమ్మ.., గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడారు. జిల్లావ్యాప్తంగా బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం నీళ్లలో నిమజ్జనం చేశారు. సద్దులు ఆరగించారు. – న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

గాంధీ బాట అనుసరణీయం


కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కామారెడ్డి గంజ్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీ చూపిన మార్గంలో ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత పనిచేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, మున్సిపల్ కమిషనర్ సుజాత పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నిరభ్యంతరంగా కబ్జా

బడాబాబుల గుప్పిట్లోకి అసైన్డ్ భూములు



ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

జిల్లాలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. వీటిని సాగుచేసుకునేందుకు నిరుపేదలకు ఇస్తే బడాబాబుల వశమవుతున్నాయి. చట్టాల్లోని లొసుగుల ఆధారంగా ఎన్వోసీలు(నిరభ్యంతర పత్రం) తీసుకుని ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటున్నారు. తాజాగా వెలుగులోకి వచ్చిన భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో రూ.కోట్ల విలువ చేసే 16 ఎకరాల అసైన్డ్‌భూముల్లో పెద్దలు పాగావేసిన తీరే ఇందుకు సాక్ష్యం. జిల్లాలో విధులు నిర్వహించిన ఓ రెవెన్యూ అధికారి ఉన్నతాధికారుల అండదండలతో బినామీల పేరిట నిరభ్యంతర పత్రాలు సాధించిన తీరు అందరిని విస్మయానికి గురిచేస్తోంది. పదుల సంఖ్యలో నిరభ్యంతర పత్రాలు సాధించి పేదల భూములను స్వాహా చేస్తున్న రెవెన్యూ అధికారి తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసైన్డ్ భూముల చట్టానికి విరుద్ధంగా జారీచేసిన ఎన్వోసీలను రద్దుచేసి భూములను నిరుపేదలకు పంపిణీ చేయడం లేదా ప్రజోపయోగ అవసరాలకు వినియోగించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

మారిన భూ స్వరూపం

భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులోని సర్వేనంబర్ 936లో సుమారు 161 ఎకరాల భూమిని ప్రభుత్వం నిరుపేదలకు సాగుచేసుకుని జీవించే నిమిత్తం పంపిణీ చేసింది. ఇందులో 21 ఎకరాల భూమికి నిరభ్యంతర పత్రాలు జారీచేసినట్లు తెలిసింది. ఇందులో 16 ఎకరాలను రెవెన్యూశాఖలో కీలక హోదాలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి 2017లో జరిగిన భూ దస్త్రాల ప్రక్షాళనలో తన బినామీల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. ఆయా భూములను 22(ఎ)లో నమోదు చేసి కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు నిరభ్యంతర పత్రాల పేరుతో ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు సహకరించినట్లు నిర్ధారణ అవుతోంది. దీంతో ప్రస్తుతం అసైన్డ్ భూములు కాస్తా పట్టాభూములుగా మారాయి.

విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి..

జిల్లాలో ప్రస్తుతం అసైన్డ్ భూముల స్వాహా వ్యవహారం దుమారం రేపుతోంది. కొందరు అక్రమార్కులు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి ఎన్వోసీలు పొందినట్లు ప్రచారం జరుగుతోంది. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎన్వోసీల జారీలో అక్రమాలుంటే నిగ్గుతేల్చాలి. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం

స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికోద్యోగులు, రాజకీయ కారణాలతో హత్యకు గురైన కుటుంబాల సభ్యులకు కేటాయించిన భూములకు మాత్రమే ఎన్వోసీలు జారీచేసే అవకాశం ఉంది. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం నేరం.

- భూములను సాగుచేసుకుంటున్న అసైన్డ్‌దారులు పదేళ్ల తర్వాత నిరభ్యంతర పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రెవెన్యూ, నీటి పారుదల, పీఆర్, ఆర్‌అండ్‌బీ, భూగర్భజల వనరులు, గనుల శాఖల అధికారులతో కూడిన డీఎల్‌సీ (డిస్ట్రిక్ లెవల్ కమిటీ) దరఖాస్తులను పరిశీలించి సీసీఎల్‌ఏకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఆమోదం లభిస్తే ఎన్వోసీలు జారీ చేసే వీలుంటుంది.
- నూతన రెవెన్యూ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత పట్టణాలు, మండల కేంద్రాలు, నిర్దేశిత పంచాయతీలకు ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రభుత్వ భూములకు ఎన్వోసీల జారీపై నిషేధం ఉంది. జిల్లాలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో 82.14 ఎకరాలకు 18, 2021-22లో 126.22 ఎకరాలకు 34 నిరభ్యంతర పత్రాలు జారీచేశారు. ఇందులో సుమారు 24 నిరభ్యంతర పత్రాలు నిబంధనలకు విరుద్ధంగా జారీచేసినవేనని తెలుస్తోంది.

ఐదు గ్రామాలు.. మూడు వార్డులు

ప్రయోగాత్మకంగా కుటుంబ డిజిటల్ కార్డుల తయారీకి సర్వే

ఈనాడు, కామారెడ్డి

రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం హెల్త్‌ప్రొఫైల్‌ను రూపొందించి యూనిక్ నంబర్‌తో స్మార్ట్‌కార్డు ఇవ్వడమే సంకల్పంగా ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి ఒక గ్రామాన్ని, పురపాలికకు ఒక వార్డును ఎంపిక చేసింది. జిల్లా పరిధిలో ఐదు గ్రామాలు, మూడు వార్డులను ఎంపిక చేశారు. వీటిల్లో ఇంటింటి సర్వే చేపట్టి నిర్దేశిత కుటుంబాల సమగ్ర సమాచారం సేకరించి నమోదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది.

ఎంపీడీవో ఆధ్వర్యంలో బృందం

ఇంటింటి సర్వే చేపట్టేందుకు సంబంధిత మండల ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. బృందంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశాకార్యకర్తలు సభ్యులుగా ఉండనున్నారు. సర్వే తీరును పర్యవేక్షించేందుకు తహసీల్దార్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు ఆర్డీవోలు, బాన్సువాడకు సబ్‌కలెక్టర్, జుక్కల్‌కు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌లను పర్యవేక్షణ చేయాలని నిర్దేశించారు. జిల్లాలో మొత్తం సర్వేతీరును సమీక్షిస్తూ సమస్యలుంటే పరిష్కరించేందుకు అదనపు పాలనాధికారి(స్థానికసంస్థలు) శ్రీనివాస్‌రెడ్డికి నోడల్ అధికారిగా బాధ్యతలు అప్పగించారు.

నియోజకవర్గం		ఎంపిక చేసిన గ్రామాలు/వార్డులు
కామారెడ్డి	:	రాజ్‌ఖాన్‌పేట(మాచారెడ్డి)
కామారెడ్డి పురపాలిక	:	వార్డునంబర్-6
ఎల్లారెడ్డి	:	అచ్చాయిపల్లి (నాగిరెడ్డిపేట)
ఎల్లారెడ్డి పురపాలిక	:	వార్డునంబర్-12
బాన్సువాడ	:	నాగారం (బాన్సువాడ గ్రామీణ మండలం)
బాన్సువాడ పురపాలిక	:	వార్డునంబర్-1
జుక్కల్	:	సిద్దాపూర్(పిట్లం)
	:	లొంగన్(జుక్కల్)

మూడు దశల్లో సమాచార సేకరణ

- నిర్దేశిత కుటుంబంలోని సభ్యుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సాగుభూముల సమగ్ర సమాచారం నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. తొలుత కుటుంబాల వారీగా వివరాలు నమోదు చేస్తారు. రెండో దశలో ఆరోగ్య సిబ్బంది వైద్యపరీక్షలు చేసి వివరాలు పొందుపరుస్తారు. మూడో దశలో కార్డుల్లోని వివరాలను సరిచూసుకుని కుటుంబ సభ్యులు నిర్ధారించిన తర్వాతే కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.
- కార్డులో వివరాలను మార్పు చేసుకునేందుకు అవసరమైన వెసులుబాటు కల్పించనున్నారు. ప్రస్తుతం సమాచార సేకరణ సమయంలో ఎవరైనా అభ్యంతరం తెలిపితే నమోదు చేయకుండా వదిలివేయాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు, ఇతరత్రా వ్యక్తిగత వివరాలు సేకరించవద్దని ప్రభుత్వం నిర్దేశించింది.
- 'ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్దేశిత గ్రామాలు, వార్డుల్లో ఇంటింటి సర్వే చేపట్టనున్నాం. బృందాల ఎంపిక, అవసరమైన కార్యాచరణ రూపొందించాం. కుటుంబ డిజిటల్ కార్డుల జారీ, వివరాల నమోదుకు అవసరమైన మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది' అని అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వైద్యుడి సరెండర్‌కు నిర్ణయం

కామారెడ్డి వైద్యవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడు ప్రవీణ్‌కుమార్‌ను వైద్యశాఖకు సరెండర్ చేయాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి ప్రతిపాదన పంపారు. కామారెడ్డిలోని ప్రైవేటు ఆసుపత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తేలడంతో గతంలోనే ఆసుపత్రిని జప్తు చేశారు. అయినా ఆ వైద్యుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టాన్ని అతిక్రమిస్తున్నారని తేలింది. ఇటీవల మహారాష్ట్రకు చెందిన ఓ గర్భిణికి ఇక్కడ లింగ నిర్ధారణ చేశారు. దీంతో ఆమె అక్కడికి వెళ్లాక ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారం బయటకు పొక్కింది. అక్కడి పోలీసులు ఇక్కడికి వచ్చి ఘటనపై ఆరా తీశారు. తరచూ వైద్య సేవల్లో నిబంధనలు పాటించడం లేదన్న కారణంతో అతడిపై క్రమశిక్షణా చర్యలకు డీఎంహెచ్‌వో వైద్యశాఖకు సిఫార్సు చేశారు.



భయంగా విధులు

పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనం కొయ్య గుట్ట తండాలోని కమ్యూనిటీ హాల్. ప్రస్తుతం ఇందులోనే పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. శాశ్వత భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్యదర్శి రహేలా బేగం ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీవో సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. నిధులు మంజూరైతే మరమ్మతులు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, బాన్సువాడ గ్రామీణం



కామారెడ్డిలో దుర్గాదేవి ప్రతిమలు

నేటి నుంచి దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 1800 పై చిలుకు దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. జిల్లాకేంద్రంలో 60 వరకు మండపాలు వెలిశాయి. శారదాంబ ఆలయం, ఇల్చిపూర్‌లోని సరస్వతీక్షేత్రంలో ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. నిత్యం అర్చనలు, అన్నదానాలు, కోలాటం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేలా భక్తులు తోడ్పాటునందించాలని నిర్వాహకులు కోరారు.

పెద్దాసుపత్రిపై చిన్నచూపు

సరిపోని వసతి... ఔషధాల కొరత

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

జిల్లాకేంద్రంలోని బోధనాసుపత్రి సమస్యల నిలయంగా మారింది. ఇరుకు గదులు, సరిపోని వసతి, ఔషధాల కొరత, పెద్దాసుపత్రిపై పాలకుల చిన్నచూపు వెరసి రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యకళాశాలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు లభిస్తాయని ఆశించిన జిల్లా ప్రజలకు నిరాశే ఎదురవుతోంది.

ఆరోగ్యశ్రీ నిధులే దిక్కు

- ఏడాదిన్నర నుంచి ఆసుపత్రి అభివృద్ధి నిధులు విడుదల కాకపోవడం సమస్యగా మారింది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ చికిత్సల ద్వారా వస్తున్న నిధులతోనే ఆసుపత్రి నిర్వహణ సాగుతోంది.
- సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి పంపిణీ చేసే ఔషధాలలో కోత విధిస్తుండడంతో ప్రైవేటు ఔషధ దుకాణాల్లో కొనుగోలు చేసి రోగులకు పంపిణీ చేస్తున్నారు. గైనిక్ విభాగంలో అత్యవసరంగా భావించే ఔషధాలు, సిరంజీల పంపిణీ సైతం సవ్యంగా సాగని పరిస్థితి నెలకొంది.



ఆసుపత్రిలో రద్దీ

చొరవ చూపితేనే..

జిల్లాలోని జనరల్ ఆసుపత్రిలో వైద్యుల నియామకంతో పాటు ఔషధాల కొరత తీర్చాలని పలుమార్లు ఉన్నతాధికారులకు లేఖలు రాస్తున్నా ప్రయోజనం లేదు. ఆసుపత్రి భవనం నిర్మాణంతో పాటు నిధుల మంజూరుకు అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాల్సి ఉంది.

పెరుగుతున్న రోగుల తాకిడి

పడకల సంఖ్య 100 నుంచి 350కి పెంచినా.. అదనపు భవనాలు లేక ఆసుపత్రి ఇరుకుగా మారింది. మాతాశిశుసంరక్షణ కేంద్రం నిర్మించినా వైద్యకళాశాలకు కేటాయించడంతో సమస్యలు మొదలయ్యాయి. ★ వైద్యకళాశాల భవనాల నిర్మాణాలకు పనులు ప్రారంభం కాలేదు. మొదటి సంవత్సరం పూర్తిచేసుకున్న వైద్యకళాశాల విద్యార్థులు ఆసుపత్రిలోకి అడుగుపెట్టారు. స్థలాభావం, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వారు చెబుతున్నారు. ★ ఓపీ 1200 నుంచి 1800 వరకు ఉంటోంది. రోగుల తాకిడికి అనుగుణంగా వైద్య సేవలు అందక నిరుపేదలు ప్రైవేటు బాట పడుతున్నారు. ఇటీవల 28 మంది వైద్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినా ప్రయోజనం లేదు. ★ ఆసుపత్రి పర్యవేక్షకుడు రాంసింగ్ డీఎంఈ అధికారులను కలిసి ఆసుపత్రిలో సమస్యలను నివేదించారు. ఇతర బోధనాసుపత్రుల నుంచి సీనియర్ రెసిడెంట్, రెసిడెంట్ డాక్టర్లు, పీజీ డాక్టర్లతో పాటు గైనిక్ విభాగంలో సేవలందించేందుకు ప్రత్యేకంగా వైద్యులను డిప్యుటేషన్‌పై పంపిస్తేనే మార్పు వచ్చే అవకాశం ఉంది.



మాత్రలు సరిపడా ఇవ్వడం లేదు

సర్కారు ఆసుపత్రిలో రోగులకు సరిపడా వైద్య సేవలు అందడం లేదు. మధుమేహం మాత్రలు 60 రాస్తే 30 మాత్రమే ఇచ్చారు. 30 మాత్రలు రాస్తే పది చేతిలో పెట్టి పంపుతున్నారు. ఇచ్చిన మందులు సరిపోక ప్రైవేటు ఔషధ దుకాణంలో కొనుగోలు చేస్తున్నాం. **- లక్ష్మీపతి, కామారెడ్డి**



బయట కొనుగోలు చేశాం

దవాఖానాలో మందులు సరిపడా లేవు. గత నెలలోనూ మందులు ఇవ్వలేదు. కొన్నింటిని బయట కొనుగోలు చేశాం. రోగులను పట్టించుకునేవారు లేరు. సర్కారు దవాఖానాకు, ప్రైవేటుకు తేడా ఉండటం లేదు. **- బాలమణి, శ్రీరాంనగర్-కామారెడ్డి**

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, న్యూస్‌టుడే: మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిలో రోగుల తాకిడి ఎక్కువగా ఉండటంతో తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆసుపత్రిలో చేపట్టిన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. రూ.40 కోట్లతో నిర్మిస్తున్న ప్రాంతీయ ఆసుపత్రి భవనం త్వరగా పూర్తి చేసి, రోగులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

సెలవులొచ్చే.. రద్దీ పెరిగే



దసరా సెలవులు రావడంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు బాగా పెరిగాయి. గ్రామీణ ప్రాంతం నుంచి కామారెడ్డి పట్టణానికి ఆయా పనుల నిమిత్తం వచ్చేవారి సంఖ్య పెరిగింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. వస్త్రాల కొనుగోలుతో పాటు బతుకమ్మ పూల విక్రయాలకు వచ్చేవారు అధికంగా ఉంటున్నారు. జిల్లాకేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో రద్దీ చిత్రమే ఇది. **- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం**

ధ్రువపత్రాల పరిశీలన

ఇప్పటి వరకు 133 మంది అభ్యర్థులు హాజరు

కామారెడ్డి విద్యావిభాగం-న్యూస్‌టుడే

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. మంగళవారం రాత్రి వరకు ఎస్జీటీ తెలుగు, హిందీ, మరాఠీ, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఎంపికైనవారి జాబితాలు జిల్లాకు వచ్చాయి. ఇప్పటివరకు 133 మందికి సంబంధించి ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించారు. బుధవారం అమావాస్య కావడంతో తక్కువ మంది ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చినట్లు సిబ్బంది వెల్లడించారు. ఒక పోస్టుకు ముగ్గురిని పిలవడంతో అభ్యర్థుల్లో ఆశలు నెలకొన్నాయి.



కామారెడ్డి విద్యాశాఖ కార్యాలయంలో అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

జాబితాలు త్వరగా రాక..

ధ్రువపత్రాల పరిశీలనకు 1:3 జాబితాలు జిల్లాలకు పంపడంలో జాప్యం జరుగుతోంది. డీఎస్సీ పరీక్ష రాసిన అభ్యర్థుల చరవాణికి లేదా మెయిల్‌కు సంక్షిప్త సందేశాలు పంపుతామని అధికారులు ప్రకటించారు. రెండు జతల నకలు పత్రాలు, ఆన్‌లైన్‌లో విచారణ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసి వివరాలు నింపి విద్యాశాఖ అధికారులకు సమర్పించాలి. కాగా మంగళవారమే ధ్రువపత్రాలు పరిశీలించాల్సి ఉన్నా జాబితాలు జిల్లాకు రాక తొలి రోజు ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. జాబితాల కోసం అభ్యర్థులు నిరీక్షించారు.

పోటీ తీవ్రం

జిల్లాలో ఒక్కో పోస్టుకు 1:13 నిష్పత్తిలో పోటీ ఉంది. కొన్ని విభాగాల్లో 1:40 పోటీ నెలకొంది. 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను పిలవడానికి ప్రధాన కారణం ఎవరైనా ఇతర ఉద్యోగాలకు వెళ్లడం.. గైర్హాజరు కావడం వంటి చర్యలకు పాల్పడితే ఆ తర్వాత వరుస క్రమంలో ఉన్నవారికి ఉద్యోగం దక్కనుంది. 'ఇప్పటివరకు వచ్చిన జాబితాల ఆధారంగా అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన చేస్తున్నాం. వ్యక్తిగతంగా సమాచారం వచ్చినవారు డీఈవో కార్యాలయానికి రావాలి' అని డీఈవో రాజు సూచించారు.



ప్రధాన వరద గేటు నుంచి మంజీరాలోకి వెళ్తున్న నీరు

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరడంతో రెండు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రానికి సాగర్‌లోకి 6000 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో ఉదయం రెండు గేట్లను ఎత్తి 5000 క్యూసెక్కులను మంజీరా నదిలోకి, వానాకాలం పంటల సాగుకోసం రెండు వేల క్యూసెక్కులు ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు చెప్పారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం నిండుకుండను తలపిస్తోందని పేర్కొన్నారు.

పైకొచ్చిన గంగమ్మ..

గత నెలతో పోలిస్తే 2.55 మీటర్ల పెరుగుదల

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

జిల్లాలోని చెరువులు, కుంటలు సెప్టెంబరులో కురిసిన వర్షాలకు జలకళను సంతరించుకున్నాయి. దీంతో భూగర్భజలాలు పైకి వచ్చాయి. ఆగస్టు నెలతో పోలిస్తే 2.55 మీటర్లు పెరిగాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా భూగర్భజల మట్టాలు 9.47 మీటర్లకు చేరుకున్నాయి. పెరిగిన భూగర్భజలాలను వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని జిల్లా భూగర్భజలశాఖ ఏడీ సతీశ్‌యాదవ్ పేర్కొన్నారు. నీటిని ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు.



భూగర్భజల వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

వివరాలు ఇలా..

మండలం	ఆగస్టు	సెప్టెంబరు
బాన్సువాడ	3.85	4.30
భిక్కనూరు	19.12	15.50
బీబీపేట	22.38	18.84
దోమకొండ	19.12	15.52
గాంధారి	14.08	10.23
జుక్కల్	4.77	4.17
కామారెడ్డి	19.27	16.81
మాచారెడ్డి	7.49	4.52
నాగిరెడ్డిపేట	29.52	19.96
నస్రుల్లాబాద్	1.14	1.52
నిజాంసాగర్	2.96	1.82
పెద్దకొడప్‌గల్	8.78	7.77
రాజంపేట	9.55	4.86
తాడ్వాయి	17.28	16.55
పిట్లం	21.98	13.58
ఎల్లారెడ్డి	13.91	12.11

మత్తును తరిమికొట్టేలా..!

●● బడుల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు ●●

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పకడ్బందీగా ముందుకు వెళ్తోంది. డ్రగ్స్ నియంత్రణలో విద్యార్థులను భాగస్వామ్యం చేసేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని గతంలో ఉత్తర్వులు ఇవ్వగా చేపట్టాల్సిన కార్యకలాపాలను ఇటీవల విద్యాశాఖ విడుదల చేసింది.


బోర్గాం(పి) ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎవరెవరంటే..

ప్రహరీ క్లబ్‌లలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అధ్యక్షుడిగా, సీనియర్ ఉపాధ్యాయుడు ఉపాధ్యక్షులుగా, సభ్యులుగా 6 నుంచి 10వ తరగతి వరకు క్లాస్‌కి ఇద్దరు విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు, స్థానిక ఠాణా నుంచి ఒక కానిస్టేబుల్ సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పాఠశాల, కమ్యూనిటీస్థాయిలో చేయాల్సిన కార్యకలాపాలు వివరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇవి చేయాలి..

మత్తు పదార్థాలతో కలిగే దుష్ఫలితాలు, అవగాహన నినాదాలు, నిర్మూలనకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్లు 18005996969, 1800110031 పాఠశాల గోడలపై రాయాలి. క్లబ్ ప్రతినిధులకు ఈ నంబర్లు కంఠస్థంగా ఉండాలి. ఉపాధ్యాయులు, విద్యార్థులు నివారణపై ప్రతిజ్ఞ చేయాలి. విద్యాసంవత్సరంలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. నెలవారీగా సమీక్షలు నిర్వహించి, పురోగతిపై చర్చించాలి. ఆల్కహాల్, పొగాకు సంబంధిత ఉత్పత్తులు, నార్కోటిక్ పదార్థాల విక్రయాలు బడి నుంచి 100మీటర్ల వరకు లేకుండా చూడాలి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు బడులు సందర్శించి లోపాలు సరిచేయాలి. మాదకద్రవ్యాల బానిసత్వం నుంచి బయటపడినవారితో మాట్లాడించాలి. జూన్ 26న మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం, మే 21న పొగాకు వ్యతిరేక దినం నిర్వహించాలి. విద్యార్థులు పక్కదారి పట్టకుండా క్రీడలు, అభిరుచులు, యోగా, మెడిటేషన్ వంటిపై దృష్టి సారించాలి.

కమ్యూనిటీ స్థాయిలో

మాదక ద్రవ్యాల బాధితులను గుర్తిస్తే వివరాలను గోప్యంగా ఉంచి, సరైన చికిత్సనందించాలి. ప్రతి సమావేశానికి తల్లిదండ్రులు హాజరై విద్యార్థుల్లో అసాధారణ ప్రవర్తనలు గుర్తిస్తే కమిటీ దృష్టికి తీసుకెళ్లాలి. విద్యార్థులకు జీవన నైపుణ్యాలు అందించేందుకు తోడ్పాటునివ్వాలి. బాధితులకు కౌన్సెలింగ్ అందించాలి. పోలీసు, ఆరోగ్య, ఎక్సైజ్‌శాఖలతో పాఠశాల విద్యాశాఖ సమన్వయం చేసుకోవాలని, క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలి. ఎన్జీవోలతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

జిల్లాలో బడుల వివరాలు..
ప్రాథమికోన్నత : 367
ఉన్నత : 574

చర్యలు చేపట్టాం

ప్రహరీ కమిటీల కార్యకలాపాలకు సంబంధించిన ఉత్తర్వులు అన్ని పాఠశాలల యాజమాన్యాలకు పంపాం. వాటిని అనుసరించి తగిన చర్యలు చేపట్టాలని సూచించాం. జిల్లా విద్యాశాఖ తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

పొదుపు మంత్రం పాటిద్దాం

విద్యుత్తు వృథా సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం 'గృహజ్యోతి' కింద తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఈ పరిధి దాటకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వినియోగదారులు జీరో బిల్లు పరిధిలోనే ఉంటారు. పథక లబ్ధిదారులే కాకుండా ఇతరులూ ఈ పొదుపును అలవర్చుకోవాలి. త్వరలో 300 యూనిట్లు దాటే వినియోగదారులకు బిల్లుల మోత మోగే అవకాశం ఉంది. ఈఆర్సీలు కూడా ప్రభుత్వానికి ఈ మేరకు ప్రతిపాదనలు పంపాయి.

ఇలా చేస్తే సరి..

☛ ఇళ్లలో ఫిలమెంట్ బల్బుల బదులు ఎల్ఈడీవి వాడుకోవాలి. ఫిలమెంట్ బుగ్గలు వాడితే 60 వాట్లు, ఎల్ఈడీ బుగ్గలు వాడితే కేవలం 9 వాట్ల విద్యుత్తు మాత్రమే ఖర్చవుతోంది. ☛ గదుల్లో ఎవరూ లేకుంటే ఫ్యాన్లు, బల్బులు బంద్ చేసుకోవాలి. రెగ్యులేటర్ ఉపయోగించుకుంటూ ఫ్యాన్ల వేగం నియంత్రించడంతో పాటు విద్యుత్తును పొదుపు చేసుకోవచ్చు. ☛ టీవీలను రిమోట్‌తో ఆఫ్ చేస్తారు. వీటికి విద్యుత్తు సరఫరా చేస్తున్న స్విచ్‌ను మాత్రం వదిలివేస్తారు. అలా చేయకూడదు.

☛ గృహాల్లో ఐఎస్ఐ గుర్తింపు కలిగిన స్టార్ రేటెడ్ విద్యుత్తు ఉపకరణాలు వాడాలి.

☛ ఇళ్లలో వాటర్ హీటర్లు, ఎలక్ట్రిక్ పొయ్యిలు, రైస్‌కుక్కర్లు వినియోగిస్తున్నారు. తక్కువ నాణ్యత కలిగిన ఈ ఉపకరణాల వల్ల అధికంగా విద్యుత్తు బిల్లులు వచ్చే అవకాశం ఉంది. వీటి వినియోగం తగ్గించుకోవడం ద్వారా విద్యుత్తు ఆదా చేసుకోవచ్చు. ☛ గ్రైండర్ వినియోగిస్తున్నప్పుడు నైలాస్ బెల్టును ఉపయోగించుకుంటే మంచిది. దీంతో యంత్రం మన్నికగా ఉండడంతో పాటు తక్కువ విద్యుత్తును తీసుకుంటుంది.

☛ ఫ్రిడ్జ్‌లను గాలి, వెలుతురు ఎక్కువగా వచ్చే చోటనే ఉంచాలి. పదేపదే ఫ్రిడ్జ్ తలుపులు తెరవడంతో విద్యుత్తు అధికంగా ఖర్చవుతుంది.

● విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించుకునే చిట్కాలివే

న్యూస్‌టుడే, కామారెడ్డి సంక్షేమం

ఉపకరణాలు కొనుగోలు చేయవచ్చు

- రమేశ్‌బాబు, ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్, కామారెడ్డి సర్కిల్

కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) భాగస్వామ్యంతో తక్కువ విద్యుత్తు ఉపయోగించుకునే నాణ్యమైన ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఇండక్షన్‌స్టవ్‌లు, 5స్టార్ బీఎల్‌డీసీ ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియంట్ ఏసీలు, ఎఈడీ ఇన్వర్టర్ బల్బులను తక్కువ ధరలకే అందిస్తున్నాయి. వినియోగదారులు www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ వారి హోం పేజీకి వెళితే అందులోని విద్యుత్తు ఉపకరణాలను కొనుగోలు చేయవచ్చు. పేజీలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆర్డర్ చేసుకోవాలి. ఈ విద్యుత్తు ఉపకరణాలు మన్నికగా ఉండడంతో పాటు విద్యుత్తు బిల్లుల భారాన్ని తగ్గిస్తాయి.



నాణ్యమైనవి వాడుకుంటే మంచిది

- లక్ష్మణ్, ఏఈ కామారెడ్డి

ఏసీలు వాడడం వల్ల బిల్లులు అధికంగా వస్తుంటాయి. 1.5 టన్నుల సామర్థ్యం కలిగిన ఏసీలను వినియోగిస్తే గంటకు 2 యూనిట్ల విద్యుత్తు ఖర్చవుతుంది. మంచి కంపెనీలకు చెందిన 5 స్టార్ రేటింగ్ కలిగిన ఏసీల వినియోగంతో కొంత మేరకు విద్యుత్తు ఆదా జరుగుతుంది. ఏసీలు ఆన్ చేసినప్పుడు కిటికీలు, తలుపులు మూసి 10 నిమిషాల పాటు ఫ్యాన్ వేసుకుంటే గది ఉష్ణోగ్రత త్వరగా చల్లబడుతుంది. తర్వాత ఫ్యాన్ బంద్ చేసుకోవాలి. ఏసీలను ఎల్లప్పుడు 25 డిగ్రీల ఉష్ణోగ్రతతో వినియోగించుకుంటే మంచిది.



హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం: హైదరాబాద్ క్రికెట్ సంఘం సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం కోమటిపల్లి మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 49.3 ఓవర్లలో 192 పరుగులు చేసింది. ఛేదనలో నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది. గురువారం కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్ జట్ల మధ్య మ్యాచ్ ఉంటుందని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

4న విద్యుత్తు ప్రజావేదిక

జుక్కల్, న్యూస్‌టుడే: జుక్కల్ విద్యుత్తు ఉపకేంద్రంలో ఈ నెల 4న విద్యుత్తు సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఏఈ మోహన్ తెలిపారు. బుధవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లి మండలాల్లోని వినియోగదారులకు సమస్యలు ఉంటే పరిష్కార వేదికకు హాజరు కావాలని కోరారు. ఈ వేదికకు ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు చెప్పారు.

జల శుద్ధి.. పర్యాటక వృద్ధి

● చెరువులను కాలుష్య రహితంగా మార్చేందుకు స్వచ్ఛంద సంస్థ ఆసక్తి

న్యూస్‌టుడే, ఆర్మూర్

హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌ను తలపించేలా చుట్టూ రోడ్డు ఉంటుంది. విద్యుద్దీపాలు, కాలక్షేపం కోసం సిమెంటు కుర్చీలు, అందరినీ ఆకట్టుకునేలా అలంకరణ చెట్లున్నాయి. చుట్టూ నివాస ప్రాంతాలున్నప్పటికీ మనిషి కొంత సమయం కూడా నిలబడలేరు. ఎందుకంటే గుట్ట ప్రాంతం నుంచి వచ్చే వరద, నివాసాల్లో నుంచి మురుగు అంతా ఇక్కడే చేరుతుంది. ఇది చాలదన్నట్లు మాంస వ్యర్థాలు, పశువుల కళేబరాలు ఇక్కడే పడేస్తారు. ఇదీ ఆర్మూర్ బల్దియాలోని మల్లారెడ్డి చెరువు (మల్లెల చెరువు) దుస్థితి. ఇలాంటి చెరువును ఇప్పుడు పర్యావరణ హిత ప్రాంతంగా మార్చబోతున్నారు. బల్దియాలోని గూండ్ల, పెర్కిట్ చెరువులను కలుపుకొని ప్రకృతి ఆధారితంగా, కాలుష్య రహిత ప్రాంతంగా మార్చేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది.


మల్లారెడ్డి చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రాణాంతక రసాయనాల గుర్తింపు..

పర్యావరణ మార్పులకు పరిష్కారాలు చూపిస్తూ.. జనావాసాల్లో ఉండే నీటి వనరులను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నాణ్యంగా మార్చేందుకు దిల్లీలోని ఫిస్టులిఫెరా సోలారిస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్వచ్ఛంధ సంస్థ శ్రీకారం చుట్టింది. సెప్టెంబరు 22న ఆర్మూర్ ప్రాంతంలోని మల్లారెడ్డి, పెర్కిట్, గూండ్ల చెరువులను పరిశీలించి నీటి నమూనాలు సేకరించారు. ఇందులో ప్రమాదకరమైన టాక్సిక్ ఆల్గల్ బ్లూమ్ నిల్వ ఉందని.. నీటి నాణ్యత దెబ్బతిందని గుర్తించింది. ఇలాంటి రసాయనాల నీటితో చేపలు మృతి చెందుతాయని, మనుషులు, పశువులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వెల్లడించింది.

నయా పైసా ఖర్చు లేకుండా

స్వచ్ఛంధ సంస్థ నీటి నాణ్యతను పెంచుతామని, ఆరోగ్యమైన చేపల ఉత్పత్తికి దోహదపడే జీవావరణాన్ని పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చింది. ఇందుకు ప్రభుత్వాల నుంచి ఎలాంటి నిధులు వినియోగించమని.. పూర్తి సేవా దృక్పథంతో పనిచేస్తామని ప్రకటించింది. ఇందుకు సంబంధించి బల్దియా కమిషనర్‌కు లేఖ రాసింది. అనుమతులిస్తే రంగంలోకి దిగుతామని వెల్లడించింది.

పాలకవర్గం అనుమతితో సహకరిస్తాం

- రాజు, బల్దియా కమిషనర్, ఆర్మూర్



చెరువుల గతి మార్చేందుకు ముందుకొచ్చిన స్వచ్ఛంద సంస్థ పనితీరును పరిశీలిస్తున్నాం. పాలకవర్గం అనుమతితో సదరు సంస్థను స్వాగతిస్తాం. కాలుష్య రహితంగా మార్చేందుకు ఎలాంటి నిధుల భాగస్వామ్యం లేకుండా ముందుకొచ్చారు. రానున్న రోజుల్లో చెరువుల్లో స్వచ్ఛమైన నీటిని చూస్తామని ఆశిస్తున్నాం. ఇందుకు పూర్తిగా సహకరిస్తాం.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక

గాంధారి, న్యూస్‌టుడే: ఈ నెల 3, 4, 5 తేదీల్లో మెదక్ జిల్లా నారాయణ్‌ఖేడ్‌లోని తక్షశిల పాఠశాలలో జరిగే 43వ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు కామారెడ్డి జిల్లా జట్లు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దబుర్రి సాయికుమార్ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో .. ఎంపికైన బాలబాలికల జట్టు సభ్యులను ఆయన అభినందించారు. జాతీయస్థాయిలో రాణిస్తే కేంద్ర ప్రభుత్వ కొలువులు సాధించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ లక్ష్మణ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.


బాలబాలికల జట్టుతో అసోసియేషన్ అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి లక్ష్మణ్ రాథోడ్

హ్యాండ్‌బాల్ క్రీడలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలం మత్తమాల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ సతీష్‌రెడ్డి తెలిపారు. వైష్ణవి, నందిని, మేనకలు ఈ నెల 3నుంచి నారాయణపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారిని అభినందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



విజేతలకు బహుమతులు అందజేత

మాచారెడ్డి, న్యూస్‌టుడే: సోమారంపేట జడ్పీహెచ్ఎస్‌లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. అండర్- 17 బాలుర, బాలికల విభాగంలో ఎల్లారెడ్డి జోన్ మొదటి బహుమతి, సదాశివనగర్, దోమకొండ జోన్లు ద్వితీయ బహుమతి గెలుపొందాయి. అండర్ -14 బాలుర విభాగంలో ఎల్లారెడ్డి జోన్ ప్రథమ, దోమకొండ జోన్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో మద్నూర్ జోన్, కామారెడ్డి జోన్ తొలి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాస్కర్ విజేతలకు బహుమతులు అందజేశారు. పీఈటీలు హీరాలాల్, నాగరాజు, సంధ్య, వీరేశం, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందుకుంటున్న ఎల్లారెడ్డి జోన్ క్రీడాకారులు

దోమకొండ వాసికి పీహెచ్‌డీ పట్టా

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండ వాసి కంటం కృష్ణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 24వ స్నాతకోత్సవంలో ఆయన పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. 'నిజామాబాద్ జిల్లా నవలలు-సామాజిక విశ్లేషణ' అనే అంశంపై ఆచార్య గండ్ల అరుణ కుమారి పర్యవేక్షణలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఆయన పీహెచ్‌డీ పట్టా అందుకోవడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.


గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న కృష్ణ

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై నిరసన

సదాశివనగర్, న్యూస్‌టుడే : ప్రాథమిక వైద్య కేంద్రాల్లో మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇవ్వడం లేదు. సదాశివనగర్ మండలం ఉత్తునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో బుధవారం గ్రామస్థులు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. గాంధారి, సదాశివనగర్ మండలాల పరిధిలో ఉండే ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యులు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, గర్భిణులు ఆస్పత్రికి వచ్చినా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సాంగ్వాన్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

ఇష్టారాజ్యంగా విద్యుత్తు స్తంభాల ఏర్పాటుపై ఆందోళన

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: మెదక్ - రుద్రూర్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నాగిరెడ్డిపేట్ ప్రధాన రహదారిపై ఒక క్రమపద్ధతిలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం స్థానికులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. పాత స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలను ఏర్పాటు చేసే క్రమంలో గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పలుకుబడి కలిగిన వారి ఇళ్ల వద్ద దూరంగా, పేదల ఇళ్లకు దగ్గరగా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారని, తీగలు గృహాలను తాకుతుండడంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వాపోయారు. హైవే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.


రోడ్డుపై బైఠాయించిన ప్రజలు

శునకాల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

పిట్లం, న్యూస్‌టుడే: వీధి కుక్కల దాడిలో చిన్నారి తీవ్రంగా గాయపడ్డ ఘటన బుధవారం అల్లాపూర్‌లో చోటుచేసుకుంది. అల్లాపూర్‌కు చెందిన లాల్‌బా వాణిశ్రీ తమ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా వీధి కుక్కలు వచ్చి దాడి చేయడంతో తల, చేతులు, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు శునకాలను తరిమేసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం చిన్నారిని పెద్దకొడప్‌గల్‌కు .. అక్కడి నుంచి నిజామాబాద్ తరలించారు. ఇటీవల వీధి కుక్కలు చేసిన దాడిలో గ్రామానికి చెందిన పలువురు గాయాలపాలయ్యారు. ఆ ఘటన మరువక ముందే చిన్నారిని గాయపరచడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


తల, చేతిపై గాయాలు



నిందితులను పట్టుకున్న పోలీసులు

బీబీపేట: తుజాల్‌పూర్, ఇస్సానగర్ గ్రామాలకు సంబంధించిన పింఛన్ల డబ్బులు రూ.10 లక్షలను సస్పెన్షన్‌లో ఉన్న తుజాల్‌పూర్ గ్రామ తపాలా శాఖ బీపీఎం భిక్య, అతడి స్నేహితుడు సురేశ్ కలిసి స్వాహా చేసిన ఘటన తెలిసిందే. బీబీపేట తపాలా శాఖ ఎస్పీఎం నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేశారు. కోటగిరి మండలం సుద్దలతాండ గ్రామానికి చెందిన నిందితులను బుధవారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.10 లక్షలను రికవరీ చేసినట్లు బీబీపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు. అనంతరం భిక్య, సురేశ్‌లను కామారెడ్డి కోర్టుకు పంపించామని పేర్కొన్నారు.

137 కిలోల గంజాయి దహనం

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కొంత కాలంగా వివిధ కేసుల్లో పట్టుబడిన 137 కిలోల ఎండు గంజాయి, 5 గంజాయి మొక్కలను జిల్లా ఎస్పీ సింధూశర్మ నేతృత్వంలో శాస్త్రీయ పద్ధతిలో బుధవారం దహనం చేశారు. కామారెడ్డి పట్టణం, దేవునిపల్లి, రాజంపేట, గాంధారి, సదాశివనగర్, నస్రుల్లాబాద్, పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 15 కేసుల్లో నేరస్థులను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ మదన్‌లాల్, సీఐలు తిరుపయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బోర్డు పెట్టారు.. హద్దులు మరిచారు..

మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే: 'కబ్జా కోరల్లో జెన్‌కో భూములు 'అనే శీర్షికన ఈ నెల ఒకటో తేదీన ఈనాడులో ప్రచురితమైన కథనానికి జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మహ్మద్‌నగర్ మండల తహసీల్దార్ సవాయిసింగ్ తన సిబ్బందితో కలిసి మంగళవారం హసన్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నంబరు 71 వద్ద.. ఇది ప్రభుత్వ భూమి అని ఫ్లెక్సీ పెట్టారు. హద్దులు రాయడం మరిచారు. ఈ విషయంపై న్యూస్‌టుడే వివరణ కోరగా..69, 70, 71 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి సుమారు 40 ఎకరాలకుపైగానే ఉందని, వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని, ఈ కారణంగా కొంత భూమి కబ్జా అయిందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పకడ్బందీగా సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ భూమి లెక్క తేలే అవకాశం ఉంది.



హసన్‌పల్లి గ్రామ శివారులో ఆక్రమిత భూమిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ సవాయిసింగ్, సిబ్బంది

బెదిరించి.. రూ.9.29 లక్షలు లూటీ

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కేసులో అరెస్టు చేయకుండా ఉండాలంటే డబ్బులు పంపాలని వ్యక్తిని బెదిరించిన ఘటన కామారెడ్డి జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గత నెల 26న కామారెడ్డికి చెందిన కిషన్‌రావు అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. తాము దిల్లీ పోలీసులమని ఫోన్‌లో చెబుతూ.. డ్రగ్స్, మనీ లాండరింగ్ కేసులో ఉన్నావని, అరెస్టు చేయడానికి తాము వస్తున్నామని బయపెట్టారు. మరుసటి రోజు ఫోన్ చేసి అరెస్టు చేయకుండా ఉండాలంటే అకౌంట్లో ఎన్ని డబ్బులు ఉంటే అన్ని పంపాలని బెదిరించడంతో కిషన్‌రావు రూ.9.20 లక్షలు పంపించాడు. అనంతరం మోసపోయానని గ్రహించి 1930కి కాల్ చేసి పోలీసులను సంప్రదించగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242

●●● జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌లో పిచ్చి మొక్కలతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. చర్యలు తీసుకోవాలి. **- శ్రీకాంత్, గాంధీనగర్**

●●● సిబ్బందికి చెప్పి సమస్య పరిష్కరించాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

●●● జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్‌లో కాల్వ పూడిక తొలగడం లేదు. **- రాజు, అశోక్‌నగర్**

●●● సిబ్బందితో కాల్వ పూడిక తీయిస్తాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

●●● జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో దోమల బెడద తీవ్రంగా ఉంది. పురపాలక యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదు. **- ప్రసాద్, విద్యానగర్**

●●● మురుగు కాల్వలో రసాయనాల పిచికారీ చేయిస్తాం. దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

●●● దోమకొండ పెద్ద చెరువు కట్టు కాలువలు మూసుకుపోయాయి. చర్యలు తీసుకోవాలి **- శేఖర్, రైతు, దోమకొండ**

●●● కట్టు కాలువలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం **- బాలకృష్ణ, ఏఈ, జలవనరుల శాఖ, దోమకొండ**

●●● పిట్లం విద్యుత్తుశాఖ కార్యాలయం సమీపంలోని మురుగు కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోంది. **ఓంకార్, స్థానికుడు**

●●● మురుగు కాల్వ శుభ్రం చేయించి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. **-యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.**

●●● పట్టణంలోని 11వ వార్డులో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్తతో పేరుకుపోయాయి. **- రాజులు, స్థానికుడు**

●●● పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో పరిష్కరింపజేశారు.

స్పందన: మద్నూర్ గ్రామ పంచాయతీ వెనుక గల్లీలో మురుగు కాలువలు శుభ్రం చేయాలని గల్లీవాసులు మేమున్నాం.. మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ సిబ్బందితో బుధవారం మురుగు కాలువలను శుభ్రం చేయించారు.

●●● ఉదయం నీరు పట్టుకుంటున్న సమయంలో కాలువలో నీరు చేరి మురుగు రహదారి పైకి రావడంతో బురదమయమై ఇబ్బందులు పడుతున్నాం. **వినోద్, విఠల్‌వాడి తండా**

●●● పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాను. **..హరీష్, కార్యదర్శి, విఠల్‌వాడీతండా.**

●●● రంగంపేట్ నుంచి కామారెడ్డి వెళ్లే అరిబండి రహదారిలో గుంత పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. **రాములు, గ్రామస్థుడు.**

●●●: త్వరలో గుంతను పూడ్చి వేయిస్తాం. **రవితేజ, ఏఈ.**

- న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం, పిట్లం, మద్నూర్, పెద్దకొడప్‌గల్, దోమకొండ,బాన్సువాడ పట్టణం,రామారెడ్డి,

శిఖం భూముల కబ్జా

న్యూస్‌టుడే,నాగిరెడ్డిపేట

గ్రామీణ ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చే గొలుసుకట్టు చెరువులు, కుంటల శిఖం భూములు కబ్జాల పాలవుతున్నాయి. తగిన చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

నాగిరెడ్డిపేట మండలంలోని జప్తి జాన్కంపల్లి, బొల్లారం గ్రామాలను కలుపుకొని ఉన్న 227 ఎకరాల ఊర చెరువు శిఖం భూమిని పలువురు ఆక్రమించారు. దీనిపై రైతులు, స్థానికులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. జప్తి జాన్కంపల్లి గ్రామానికి



మాసానిపల్లిలో శిఖం భూమిలో రహదారి నిర్మాణం

చెందిన కొందరు రైతులు బొల్లారం శివారులోని చెరువు శిఖం భూమిని కబ్జా చేసి పంటలు పండిస్తున్నారు. మాసానిపల్లికి చెందిన కొందరు రైతులు నిజాంసాగర్ ప్రాజెక్టు ముంపు జలాల శిఖం భూములను ఆనుకొని ఉన్న శాఖం చెరువు వద్దగల 8 ఎకరాల 30 గుంటల భూమిని అభివృద్ధి చేసుకుంటామని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు.

హద్దులు ఏర్పాటు చేస్తాం:

శ్రీనివాస్, తహసీల్దార్

మండలంలోని చెరువు శిఖం భూములు కబ్జాకు గురైన మాట నిజమే. సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తాం. శిఖం భూమి ఉంటే స్వాధీనం చేసుకుంటాం.

సత్ప్రవర్తనతో జీవించాలి

కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఖైదీలు బెయిల్‌పై బయటకు వచ్చినప్పుడు సమాజంలో గౌరవంగా జీవించాలని, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ సూచించారు. బుధవారం గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఆయన కామారెడ్డి సబ్ జైలును సందర్శించారు. ఆర్టీఐ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. గాంధీ జీవిత చరిత్రపై ఉపన్యాసాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ రామన్, జైలు సూపరింటెండెంట్ సంజీవ్‌రెడ్డి, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్



దోమకొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జిల్లాకేంద్రంలో..



పాత బాన్సువాడలో...

బతుకమ్మ సంబురాలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు పాటలు పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, బృందం**



కామారెడ్డి జన్మభూమిరోడ్డులో ..



జిల్లా కేంద్రంలో...విద్యానగర్‌లో...



భిక్కనూరులో..



కామారెడ్డి: లిటిల్ స్కాలర్స్ బడిలో..



ఆర్టీసీ బస్సును ఆపిన యువకులు

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరులో కొందరు యువకులు బుధవారం ఆర్టీసీ బస్సును అడ్డుకున్నారు. కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆర్టీసీ బస్సు భిక్కనూరు బస్టాండ్ లోనికి రాకుండా బయట నుంచే వెళ్లడంతో స్థానిక యువత అడ్డుకుని డ్రైవర్‌ను ప్రశ్నించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్టాండ్‌లోనికి బస్సును పంపడంతో వివాదం సద్దుమణిగింది. బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని, బస్సులను ప్రాంగణంలోకి పంపాలని భిక్కనూరు ప్రజావాణిలో యువత ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



బస్సును అడ్డగించిన యువకులు

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

బీబీపేట, న్యూస్‌టుడే: కామారెడ్డి రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన పప్పుల రాజేంద్రప్రసాద్‌ను బుధవారం మండల రైస్‌మిల్లర్లు, డివిజన్ ప్రతినిధులు కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న బీబీపేట రైస్ మిల్లర్లు, డివిజన్ ప్రతినిధులు

నాగిరెడ్డిపేట ఎంఈవోపై ఫిర్యాదు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: రియల్‌ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న నాగిరెడ్డిపేట ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు డీఈవోకు బుధవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. సదరు ఎంఈవో బతుకమ్మ ఉత్సవాల పేరిట మండలంలోని ఉపాధ్యాయులను ఎమ్మార్సీ కార్యాలయానికి పిలిపించి సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ గురించి వివరించారని, ఆ సంస్థలో స్థలాలు కొనుగోలు చేసేలా ప్రేరేపించినట్లు పేర్కొన్నారు. ఎంఈవోతో పాటు గోపాల్‌పేట, తాండూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ఎస్‌వోలు ఈ కార్యక్రమానికి మద్దతు ప్రకటించినట్లు ఫిర్యాదులో వివరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లం రామచందర్, ఉపాధ్యాయులు విశ్వనాథుల అంజనేయులు, రాజశేఖర్, సాయిలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో రాజుకు ఫిర్యాదు చేస్తున్న సంఘం ప్రతినిధులు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎన్‌డీసీ అధికారిణి శిరీష

నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలి

బీర్కూర్, న్యూస్‌టుడే: నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌డీసీ ప్రోగ్రాం అధికారిణి శిరీష అన్నారు. బీర్కూర్‌లో ఓ మిఠాయి దుకాణంలో బూజు, వెంట్రుకలు వచ్చిన మిఠాయిలు విక్రయిస్తున్నారంటూ ఆరోపణలు రావడంతో ఈ మేరకు తనిఖీలు చేపట్టారు. దుకాణ యజమానిని ప్రశ్నించి మిఠాయిలు తయారు చేసే గది పరిశీలించారు. సీహెచ్‌వో రవీందర్ తదితరులు ఉన్నారు.

పీపీకి సత్కారం

మాచారెడ్డి, న్యూస్‌టుడే: చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామిని జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ బుధవారం దర్శించుకున్నారు. కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.



గాంధారిలో ..



బాన్సువాడలో నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఆగ్రో ఛైర్మన్ బాల్‌రాజ్, బల్దియా ఛైర్మన్ గంగాధర్



రామారెడ్డి : ఉప్పల్‌వాయిలో ..



నిజాంసాగర్: కోమలంచలో ..



మాచారెడ్డిలో..



జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో

మహనీయుల మార్గం అనుసరణీయం

మహనీయుల మార్గం అనుసరణీయమని వక్తలు అభిప్రాయపడ్డారు. వివిధ పార్టీలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బుధవారం గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతులను నిర్వహించారు. కార్యాలయాల్లో , చౌరస్తాలో ఉన్న వారి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **- న్యూస్‌టుడే , బృందం**



భిక్కనూరులో..



కామారెడ్డిలో.. భాజపా జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



బాన్సువాడలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పోచారం



కామారెడ్డి పురపాలక కార్యాలయంలో



బీబీపేటలో..



బిచ్కుంద గ్రామీణం: గోపన్‌పల్లిలో ..



ఎల్లారెడ్డిలో..



పిట్లంలో ..



నస్రుల్లాబాద్‌లో..



దోమకొండలో..



బీర్కూర్‌లో..



సదాశివనగర్‌లో..



జుక్కల్‌లో కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, తదితరులు



కామారెడ్డిలో భారాస ఆధ్వర్యంలో ..



పెద్దకొడప్‌గల్‌లో ...

లింగంపేటలో

బిచ్కుందలో ..

మద్నూర్‌లో ..

తాడ్వాయిలో ...

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో..

కామారెడ్డి టీఎన్జీవోస్ కార్యాలయంలో..

చరవాణి అందజేత

మాచారెడ్డి: కాకుల గుట్టకు చెందిన సయ్యద్ అబ్దుల్లా చరవాణి పోగొట్టుకోగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి బుధవారం అందజేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

7న సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

గాంధారి: ఈ నెల 7న సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ మార్కెట్ ఆవరణలో ప్రారంభించనున్నామని, రైతులు తొందరపడి దళారులకు మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించొద్దని డీసీసీబీ, ఐడీసీఎంఎస్ డైరెక్టర్, సొసైటీ ఛైర్మన్ పెద్దబుర్రి సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోయాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.4892 ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెక్కు అందజేత

నస్రుల్లాబాద్, : మిర్జాపూర్ వాసి జంగిలి నారాయణ ఇటీవల మంచంపై నుంచి కింద పడి తలకు తీవ్రంగా గాయమైంది. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా రూ.5 లక్షల ఎల్వోసి చెక్కు మంజూరైంది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద మండలం వాజిద్‌నగర్ మంజీర తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. మృతుని వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని కుడి చేతిపై ఆంగ్లంలో సోను అని రాసి ఉందని, ఒంటిపై నల్లని ప్యాంటు ధరించాడని తెలిపారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి రోజున మాంసం అమ్మొద్దనే నిబంధన ఉంది. అదే రోజున పితృ అమావాస్య కారణంగా పెద్దలకు మాంసంతో నైవేద్యం పెట్టాల్సి ఉండటంతో వ్యాపారులు విక్రయాలు కొనసాగించారు.

ఎల్లారెడ్డిలో గుప్పుమన్న గంజాయి...ముగ్గురి అరెస్టు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాలపై ఎల్లారెడ్డి పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అయినా కూడా గంజాయి ముఠా ఏ మాత్రం ఆగడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి నిషేధిత మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నారు. తాజాగా ఎల్లారెడ్డి పోలీసులు బుధవారం 280 గ్రాముల ఆల్ఫ్రాజోం, 140 గ్రాముల క్లోరో హైడ్రేడ్, 55 గ్రాముల గంజాయి, రూ. 10వేల నగదు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. డీఎస్పీ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్‌కు చెందిన ఈశ్వర్‌గౌడ్, నాగిరెడ్డిపేట మండలం జప్తిజానకంపల్లికి చెందిన నారాగౌడ్‌లు వరుసకు మామా అల్లుళ్లు. నారాగౌడ్ కల్లులో కలిపే ఆల్ఫ్రాజోంను అల్లుడు వరుస అయిన ఈశ్వర్‌గౌడ్‌కు సరఫరా చేసేవారు. ఈశ్వర్‌గౌడ్‌కు అదే గ్రామానికి చెందిన దగ్గరి బంధువైన శ్రీనివాస్‌గౌడ్‌తో పాత కక్షలున్నాయి. ఈ క్రమంలో ఈశ్వర్‌గౌడ్‌ను ఎలాగైనా కేసులో ఇరికించాలని శ్రీనివాస్‌గౌడ్ నిర్ణయించాడు. ప్రణాళికలో భాగంగా ఈశ్వర్‌గౌడ్ ఇంట్లో ఆల్ఫ్రాజోం, క్లోరో హైడ్రేడ్, గంజాయిని పెట్టేందుకు అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్‌తో రూ. 15వేల నగదు, గ్రామ పంచాయతీలో ఉద్యోగం ఇప్పించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. లక్ష్మణ్ నిషేధిత మాదకద్రవ్యాలను ఈశ్వర్‌గౌడ్ ఇంట్లో పెట్టారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్‌లు వెళ్లి ఈశ్వర్‌గౌడ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో ఆల్ఫ్రాజోం, క్లోరో హైడ్రేడ్, గంజాయిని పట్టుకున్నారు. క్లోరో హైడ్రేట్, గంజాయి ఎలా వచ్చిందో తెలియదని ఈశ్వర్‌గౌడ్ చెప్పడంతో లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో విషయం బయటకు వచ్చింది. శ్రీనివాస్‌గౌడ్ పరారీలో ఉండడంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈశ్వర్‌గౌడ్, నారాగౌడ్, లక్ష్మణ్‌లను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ, ఎస్సైలను ఎస్పీ సింధూశర్మ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు , చిత్రంలో సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్



ఎంపీ సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్థులు

రహదారి విస్తరణను కుదించండి

మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను నారాయణఖేడ్‌లోని తన నివాసంలో మహ్మద్‌నగర్ మండల వాసులు బుధవారం కలిశారు. మహ్మద్‌నగర్ మండలం మీదుగా వెళ్తున్న మెదక్-రుద్రూర్ 765/డీ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల వరకు పనులు కొనసాగుతున్నాయని తద్వారా దుకాణాలు, ఇళ్లు కోల్పోతున్నామని దాన్ని కుదించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడతానని ఎంపీ హామీనిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు లోక్యనాయక్, తోట రాజు, మండల కేంద్ర ప్రజలు శ్రీనివాస్, భాను, మల్లేశం, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీలు

బీర్కూర్, న్యూస్‌టుడే: బీర్కూర్, తిమ్మాపూర్, కిష్టాపూర్, వీరాపూర్, భైరాపూర్ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రైస్‌మిల్లులు తనిఖీలు చేశారు. గత వానాకాలంలో ప్రభుత్వం కేటాయించిన మిల్లులకు సీఎంఆర్ ధాన్యం ఎంత ఇచ్చారు? తదితర వివరాలు ఆరా తీశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ షరీఫ్, తహసీల్దార్ లత, ఎంపీఎస్‌వో రమణ తదితరులు ఉన్నారు.

దసరా క్రికెట్ పోటీలు ప్రారంభం

గాంధారి, న్యూస్‌టుడే: ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల ఆవరణలో తూర్పు సజన్ రాజ్ ఆధ్వర్యంలో బుధవారం దసరా క్రికెట్ ట్రోఫీ పోటీలను పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ చంద్ర సిర్వితో పాటు ముఖ్య అతిథి ఎస్సై ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూర్పు రాజులు ప్రారంభించారు. వడ్ల ప్రకాష్, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.